# బొమ్మ వెనక బొరుసు

ఆ విషయం నేను నమ్మలేదు.

ఒకరు___

నాజూగ్గా, రివటలా, నాగరికతా మహారణ్యంలో దట్టమైన నీడల చాటున పెరిగిన మొక్కలా సన్నగా, తెల్లగా, కాంతిరేఖవైపు, కొత్త లోకాలవైపు, అందమైన కలలవైపు వొంగిన చూపుల్తో మత్తుగా, మనోహరంగా వుండి, పల్చటి అల్పమైన పెదాలవెనక స్పష్టమైన, సంస్కార పూరితమైన ఉచ్ఛారణతో కంఠాన్ని మీటగల యువతి.

మరొకరు___

మొద్దుగా, మోటుగా, పరిస్థితుల రాతి నేలలో మొలిచి గిడసబారి పోయిన మొక్కలా, పొట్టిగా; ఆచ్ఛాదనలేని ఆకాశంకింద ఎండలో, గాలిలో పుష్టిగా, నల్లగా పెరిగి; భయంభయంగా, మధ్యమధ్య కుతూహలంగా, మరీ వినయంగా జారే చూపులు గలిగి; ఒకదాని కొకటి అంటుకుపోయి ముద్దముద్దలుగా, కలగాబులగంగా కలిసిపోయిన మాటల్ని శృతిపోయిన కంఠంలోంచి అసహ్యంగా పలికే అమ్మాయి.

వాళ్ళిద్దరూ అక్కచెల్లెళ్ళని చెప్తే నమ్మకం కలగడంలేదు. ఒకరి పక్క ఒకరు నుంచొని, ఒకరితో ఒకరు సన్నిహితుల్లా మాట్లాడుకుంటున్నా ఎందుకో వాళ్ళిద్దరిమధ్యా అస్పష్టంగా ఎంతో తేడా కనిపిస్తూనే ఉంది. సినిమాకీ నాటకానికి మధ్య, డ్రాయింగుకీ ఫొటోకీ మధ్య, సంఘటనకీ కథకీ మధ్య వున్నభేదమే వాళ్ళమధ్యా వుంది. ఎంత ఏకత్వం గురించి ప్రయత్నించినా ఆ మధ్య భిన్నత్వం సున్నితంగా కనిపిస్తూనే వుంది.

అందుకే నాకు నమ్మకం కలగడంలేదు.

ఇది పట్టించుకోవలసిన విషయం కాకపోయినా కుతూహలాన్ని అణచుకోలేక పోతున్నాను.

హాస్పిటల్లో హౌస్ సర్జన్‌గా పనిచేస్తున్న ఓ మిత్రుడి గురించని వెళ్ళాను. అక్కడకు వెళ్ళేసరికి యీ సంఘటన__

నాజూగ్గా వున్న అమ్మాయి తండ్రికి ఏక్సిడెంట్ అయితే హాస్పిటల్లో చేర్పించారట. రక్తంపోతే ఎక్కించాల్సివచ్చి రక్తసంబంధం వున్న వాళ్ళెవరినైనా పట్టుకురమ్మంటే ఆ పొట్టి అమ్మాయిని తీసుకొచ్చిందట.

"మా చెల్లెలు రక్తం యిస్తుంది. నేను మరీ అర్భకురాల్ని" అంది.

"అవునండి. నేనే యిద్దామని వొచ్చా, తీసుకోండి" అంది పొట్టి అమ్మాయి.

ఆమె మాట తీరుకూ, ఈమె మాటతీరుకూ చాలా తేడా వుంది. మరోసారి పరీక్షగా యిద్దర్నీ చూశాను. పోలికల్లేవు.

ఆ విషయం అంతగా పట్టించుకునే వాడ్నే కాను. అయితే ఆమె ప్రభుత్వ హాస్పిటల్స్ తీరు తెన్నుల గురించీ, డాక్టర్లూ, నర్సుల బాధ్యతా రహితమైన ధోరణిగురించీ, ప్రభుత్వాన్ని గురించీ ఆవేశపూరితంగా పావుగంటసేపు అనర్గళంగా మాట్లాడేసరికి ఆమె వునికిని ప్రత్యేకంగా గుర్తించాల్సి వచ్చింది. కొంత ఉత్సుకత ఏర్పడింది.

కుతూహలంతో యిద్దర్నీ పరిశీలించాను. కావాలని పలకరించి అవీ యివీ అడిగాను.

నాజూగ్గా వున్న అమ్మాయి పేరు పరిమళ అట.

సంభాషణ మధ్యలో ఆమె వేసిన ఇంగ్లీషు ముక్కల్నిబట్టి ఆమె చదువుకున్నట్టే అనిపిస్తోంది. నాజూకైన తిళ్ళమూలంగా రక్తం చేరని తీగ శరీరం ఆమెది. ఇబ్బంది లేకుండా పెన్సిలునో, పెన్నునో మాత్రమే పట్టుకోగలిగే సన్నటి వేళ్ళు. బరువు మోయలేని సన్నపాటి మెడలో ఒకే ఒక లాకెట్టు. వక్షాలమీద యౌవనానికి కొలబద్దగావుండాల్సిన చీర మడతలు అంతగాలేని వాయిలుచీర పవిట. కాలాన్ని నాగరికత తాళ్ళతో నాజూగ్గా ముడేసికట్టిన రిస్టువాచీ కొంత శృంగారమూ,మరికొంత అందమూ కలిపి రాసుకున్న గోరింటాకు గోళ్ళు. ఆమెను మొత్తంగా పోల్చుకోవాలంటే_ఆమె ఒక సన్నజాజి మొగ్గ.

రెండో అమ్మాయి పేరు తెలుసుకోలేదు. ఆమెకు అందంలేదు. వయసు వుంది. పది కిలోల బియ్యం సంచిని ఆయాసంలేకుండా ఎడమ చేత్తో ఎత్తి మొయ్యగల ఆరోగ్యం వుంది. ఆమె ఒంటిమీద నాగరికతను ప్రకటించుకోవడానికి ఆమె పడేపాట్లకు గుర్తులున్నాయి. నల్లని ముఖం మీద బొల్లిలా స్పష్టంగా కనిపించే పౌడరు ఎబ్బెట్టుగా వుంది. కళ్ళు పెద్దవి. ఆ మధ్య గుడ్లుకూడా పెద్దవే. కలలు కనడమూ, ఆలోచనల్లోకి ఎగరడమూ అంతగా చేతకావనిపించే మందమైన చురుకులేని చూపులు. పెదాల మీద విరుచుకుపడ్డ ఎతుపళ్ళు, పొట్టివల్ల నేలను తాకే చీరకుచ్చిళ్ళలో మరీ బుట్టబొమ్మలా అనిపించే ఆకారం_పరిమళను ఒక సన్నజాజి మొగ్గగా పోల్చినప్పుడు ఈమె ఒక బొడ్డుమల్లి.

డాక్టరు మిత్రుడితో పరిమళ యింకా వాదిస్తూనే వుంది.

"ఇలా మేమే రక్తం యిచ్చుకొంటుంటే యిక "బడ్‌బేంక్" వుండి ప్రయోజనం ఏమిటి? పలుకుబడి వున్న వాళ్ళనీ. రాజకీయ నాయకులనీ అయితే బయటినించి తెచ్చుకోమనేవారా? సామాన్యజనానికి ఉప

యోగంలేని యివన్నీ ఎందుకు? ప్రజలంటే కేవలం పలుకుబడిగలవారూ, పదవిలో వున్నవారూనా?"

ఎంత కోపం ఆమె ముఖంలో!

ఎంత కసి ఆ మాటల్లో!!

చదువుకున్న అమ్మాయిలాగానే వుంది. బహుశా ఏ పాలిటిక్సు గ్రూపో తీసుకుని చదువుకుని వుండాలి. ఆమె మాటల్లో ఎక్కడైనా కాస్తంత యింగువ వాసనగానీ, వులివాసనగానీ, కిరసనాయిలు వాసనగానీ లేదు. అంతా రాజకీయవాసనే. పాలిటిక్స్ చదివేవారికి చొరవా, ధైర్యమూ ఎక్కువగా వుంటాయి కాబోలు! అదే ఏ చరిత్రో, సైన్సో, జాగ్రఫీయో, కళలో, మరోటో నేర్చినవాళ్ళకు యింత తెగింపు వుండదు. దానికి తోడు వాళ్ళ భాషే వేరు. ప్రభుత్వానికి కొన్ని పడికట్టుపదాలూ, దాన్ని విమర్శించే వారికి కొన్ని పడికట్టు పదాలూ ప్రత్యేకంగా వుంటాయి. ఇరువర్గాల వారూ తరచు విచ్చలవిడిగా రాళ్ళల్లా ఆ మాటల్ని విసురుకొంటూనే వుంటారు.

అభ్యుదయం, ప్రగతి, ధ్యేయం, అభివృద్ధి పథం, ప్రజలందరికీ, దేశ శ్రేయస్సు, కలిసికట్టు వంటి రాళ్ళు ప్రభుత్వందగ్గరా; పీడిత జనావళి, ఆకలి, విప్లవం, అన్నార్తులు, జనత, శ్రామిక శక్తివంటి రాళ్ళు ప్రభుత్వేతర వర్గాలదగ్గరా గుట్టలు గుట్టలుగా వుంటాయి.

ఆ రాళ్ళల్లోంచి కొన్నిటిని పరిమళ ఏరుకొచ్చినట్టే అనిపించింది!

జిల్లా హెడ్ క్వార్టర్సు ఆసుపత్రిలో బ్లడ్ బేంక్ వున్నా పెద్దపెద్ద సిటీలలో వున్నట్టుగా "రక్తనిధులు" నిలవ అంతగా యిక్కడవుండ వనిన్నీ, రక్తాన్ని నిలువచేసే సౌకర్యాలు తగినంతగా లేక ఎప్పటికప్పుడు రోగికి అవసరమైన రక్తాన్ని అతని బంధువుల వద్దనుంచే తీసుకోవడం జరుగుతుందనిన్నీ ఆమెను నమ్మించడానికి మా మిత్రుడు చాలా యిబ్బంది పడ్డాడు.

సాధారణంగా ఆడవాళ్లు ఏ విషయాన్నయినా యిట్టే నమ్మేస్తారు.

ఒకవేళ మొదట్లోనే వారికి అనుమానంగాని వస్తే-యిక ఎంత గింజుకు చచ్చినా వాళ్ళచేత నమ్మింపజేయడం సాధ్యంగాదు.

"సరేలెండి. ఇప్పుడీ గొడవంతా దేనికిగాని మా చెల్లెల్ని పట్టు కొచ్చాను. అది రక్తం యిస్తుంది. దానిరక్తం పనికొస్తుందేమో చూడండి" అంది ఆమె. ఆ మాటల్నిబట్టే ఆమె ఎంతగా నమ్మిందో తెలుస్తూనే వుంది!

మగాళ్ళలాగ ఆడాళ్లు మొండిపట్టు పట్టరు. పరిస్థితులతో రాజీ పడడం, ఓటమిని ఒప్పుకోవడం పుట్టుకతో వచ్చిన కవచకుండలాలు వారికి.

ఆ పొట్టి అమ్మాయి రక్తం పరీక్షించి సరిపోతుందని తేల్చాడు మిత్రుడు. రక్తం యిచ్చే ముందు ఆ అమ్మాయి ముఖంలో దిగులు,భయం పలచపలచగా కనిపించాయి నాకు. పరిమళవైపు ఆ అమ్మాయి చూసిన చూపు, కొత్తగా బళ్ళో వేసిన కుర్రాడు క్లాసులోకి వెళ్లేముందు చూసిన చూపులా వుంది. కొత్త వాతావరణంలోని బెరుకూ, ఏమిటో కోల్పో తున్నామన్న దిగులూవుంది. ఇంకా ఆ కళ్ళల్లో గతిలేక శరీరం అమ్ము కున్న ఆడదానిమీద సంఘం ఫోకస్‌చేసిన చూపుల మధ్య చిక్కుకుపోయి సిగ్గునే బట్టగా కప్పుకున్న అసహాయత వుంది. అదివున్నా లేకపోయినా ఆ భావమే నాకు అనిపించింది. మొదటినించీ వాళ్ళిద్దరూ అక్కచెల్లెళ్ళు కాదన్న భావమే స్థిరపడిపోయి ప్రతి చర్యకూ విపరీతార్థాల్ని తీస్తోంది మనసు.

మళ్ళీ చెపుతున్నాను వాళ్ళిద్దరూ అక్క చెల్లెళ్ళలా నాకు కనిపించ డంలేదు.

రక్తం యిచ్చి లేచి కూర్చున్నాక "నాగమ్మా! టీ తీసుకుంటావా, తెప్పిస్తాను" అంది పరిమళ.

అయితే ఆ పొట్టి అమ్మాయిపేరు నాగమ్మ అన్నమాట!

ఎబ్బెట్టుగానూ, వింతగానూ వుంది నిజమే.

ఎన్నిలేవు లోకంలో వింతలు.

ఆంధ్ర రాజధానీ నగరంలో గాలీ, వెలుతురూ ఉచితంగా ధారాళంగా లభించేచోట రాజకీయ నాయకుడి హుందా అంతటి ఠీవిగా దర్పంగా, వారి వాక్యాగారంతటి అందంగా ఆకర్షణీయంగా, సభల్లో వారి హృదయాలంత విశాలంగా ఉన్నతంగా కట్టిన కాంక్రీటు భవనాల సంజీవరెడ్డినగర్ కాలనీ పక్కనే, దానికి ఆనుకుని అతిబీదగా ఒదిగొదిగి కుక్కి చింపిన విస్తరిలా, పైకప్పు తాటాకుల్ని అటు ఎండా, ఇటు వానా,మరోవైపు గాలీ కలిసి కకావికలుచేసిన పూరిళ్ళ బాపూనగర్ వుండడం వింతే అనుకుంటే-

దక్షిణాది ధాన్యాగారంగా, భారత దేశానికి అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రదేశంలో మూడోవంతు జనాభా మూడుపూటలా తృప్తిగా తినడానికి తిండిలేక అర్ధాకలితో జీవిక వెళ్ళబోసుకోవడం వింతే అనుకుంటే.

పరిమళ చెల్లెలు నాగమ్మకూడా వింతే.

రక్తం యిచ్చిన తర్వాత నాగమ్మ, ఆ రక్తం తీసిన సీసావైపు కొద్దిక్షణాలు తదేకంగా చూసింది. ఆ తర్వాతకూడా ఆమె మాటి మాటికి ఆ సీసావైపు చూస్తూనే వుంది. రక్తం తీయడంవల్ల గాబోలు ఆమె ముఖం అలసటగా వుంది. దిగులుగా వుంది. కాంతిలేని మబ్బు తనంతో నిండివుంది. పొగచూరిన కిరసనాయిలు దీపం బుడ్డీలా వుంది.

తీసిన రక్తం రోగికి ఎక్కించే ప్రయత్నంలో వున్నాడు మిత్రుడు. 'బాగా ఆలస్యమవుతుందేమో సాయంకాలం వొచ్చి కలుస్తాలే' అని మిత్రుడు చెప్పినా నేను వచ్చేయలేదు. ఇంటికివెళ్ళి చేసే పనేమీ లేదని చెప్పి అతన్ని వార్డులోకి పంపి, అతని గదిలో మెడికల్ జర్నల్ ఒకటి వుంటే చదువుతూ అక్కడే వుండిపోయాను. ఇదేదో తెల్చుకోనిదే

యింటికి కదలాలనిపించలేదు నాకు. విషయం చిన్నదే అయినా నాపంతం అలాంటిది. విడుపు తక్కువ, పట్టు ఎక్కువ.

రెండుగంటల తర్వాత ఆ అమ్మాయిలు యిద్దరూ కలిసి యింటికి కాబోలు బయలు దేరారు. గేటుదగ్గర రిక్షా బేరమాడారుగాని, బేరంకుదర లేదో ఏమో నడుస్తూనే బయలు దేరారు.

"ఇంటికి వెళ్లిపోతానోయ్" అని మిత్రుడితో చెప్పి నేనూ వాళ్ళ వెనకే బయలు దేరాను.

వాళ్లు నన్ను చూడలేదు.

వాళ్ళకూ నాకూ మధ్య తగినంత దూరం వుంది. మధ్య మధ్య జనం, బళ్లు అడ్డొస్తున్నాయి. వాళ్ళని వెంబడిస్తోంటే చిన్నప్పుడు ఆడిన దాగుడు మూతలు జ్ఞాపకానికొస్తున్నాయి. వీధులు సన్నవి. సందులు యిరుకువి. చటుక్కున ఏ సందులోకో మాయమయ్యేవారు. గబ గబా వెళ్ళి వెతుక్కోవలసి వచ్చేది. ఈ మధ్యలో తెలిసిన వాళ్ళెవరన్నా కనిపిస్తారేమోనని నా భయం నాది.

వెళ్ళి వెళ్ళి వాళ్ళొకచోట ఆగిపోయారు. అక్కడ గుంపుగా ఓ పదిహేను పాకలు వున్నాయి. వాటిచుట్టూ మూడువేపులా పహరా కాస్తోన్నట్లు సెంట్రీల్లాంటి పటిష్ఠమైన మేడలున్నాయి. ఒక వైపు పురపాలక సంఘంవారి ఔదార్యానికి చిహ్నంగా పబ్లిక్ మురుగుదొడ్లున్నాయి. దాని యివతల దినదిన ప్రవర్ధమాన మౌతున్నట్టనిపించే పెంటకుప్ప ఒకటి చచ్చిన కుక్కపిల్లకీ, గోచీల్లేని పిల్లకాయలకీ ఆశ్రయం ఇస్తోంది. కొండల్లాంటి మేడల్లోంచి ప్రవహించివచ్చి, అన్నీ కలుసుకుని విశాలమైన మురుగునీటి జీవస్రవంతి ఒకటి ఆ పాకల పక్కగా పోతోంది. అందులో రెండుపందులు పడవల్లా విహరిస్తున్నాయి. ఒకావిడ కుక్కను వేటాడుతోంది. నోట్లోంచి జారిపోకుండా దేన్నో గట్టిగా కరుచుకుని ఆ కుక్క ఆమెకు అందకుండా దూరంగా పారిపోయింది.

పరిమళ పరసులోంచి ఓ నోటుతీసి నాగమ్మ కిచ్చింది. అది ఏ నోటో స్పష్టంగా కనిపించలేదు. నాగమ్మ తలాడించి వెళ్ళిపోయింది. ఒంటిమీద గజ్జి కురుపుల్లావున్న పాకల్లోకి, చీములా కారుతున్న మురికి కాలువల్ని దాటుకుని నాగమ్మ వెళ్ళిపోయింది.

పరిమళ చీరచెంగుతో ముక్కు మూసుకుని వాంతి చేసుకోబోయే దానిలాగ దారిపొడుగునా వుమ్మివూస్తూ ఎవరో తనని తరుముకొస్తున్నట్టు కంగారుగా అక్కడ్నుంచి వెనక్కి తిరిగివస్తోంది. నేను గబగబా కదిలి ఓ కిళ్ళీకొట్టుదగ్గర ఆగిపోయాను సోడా తాగే నెపంతో.

సోడాతాగి ఆమెను వెంబడించాలనుకున్నానుగాని ఆమె ఆ దగ్గర్లోని ఓ సందులోకి మళ్ళింది. ఆ సందు మరీ యిరుకుది. గజమున్నర కూడా వెడల్పు వుండదు. అటూ యిటూ గాలి చొరని యిరుకు మేడలు. ఎప్పుడో వూరు యింతగా పెరగని రోజుల్లో కట్టిన మేడలవి.

వెనక్కి తిరిగి వచ్చేశాను.

ఓ గొప్ప విషయాన్ని కనిపెట్టినంత ఆనందంగా వుంది మనస్సు. అందమైన అమ్మాయి ఆడిన అబద్ధపు కొసపట్టుకుని వెళ్తే ఆవలి కొసలో ఎంత స్వార్థం మూటకట్టుకున్నదో తెలుసుకోగలిగానన్న ఆనందం కావచ్చు. నా ఆలోచనలు వాస్తవానికి దగ్గరగానే సంచరిస్తాయి తప్ప కల్లో అర్థంలేని వ్యాహ్యాళి జరపవని ఋజువు పర్చుకున్నానన్న సంతృప్తి కావచ్చు. పట్టుదలతో అనుకున్న పని సాధించి తీరగలనన్న ఆత్మ విశ్వాసానికి యిదొక మెట్టుగా నిరూపించుకున్నానన్న సంతోషం కావచ్చు—నా మనస్సు గర్వంతో నిండిపోయింది.

పరిమళమీద చాలా కోపం వచ్చింది నాకు. ఉదయం అంతలా పోట్లాటకొచ్చిందికదా ఇప్పుడామె చేసిందేమిటి? ఇదామె స్వార్థంకాదూ. నాగమ్మ తినీ తినకా ఒక్కొక్క రక్తపుబొట్టునే పోగుచేసుకుంటే ఆమె బీదతనాన్ని ఆసరాగా తీసుకుని డబ్బు ఎరచూపి ఆ రక్తాన్ని కొనడం ఏం న్యాయం? పరిమళ మహా అయితే అయిదు రూపాయలకన్న ఎక్కువ

ఇచ్చి వుండదు. అయిదు రూపాయలూ ఖర్చుపెట్టి తిండితింటే పోయిన రక్తం భర్తీ అవుతుందా? ఆ అయిదుతో పేరు మోసిన ఏ విదేశీ టానిక్కు కొని వాడినా, పోయిన రక్తంలో అయిదో వంతయినా ఒంటికి పట్టదే. ఇది మాత్రం తిమింగలం వేటకాదూ? బీదవాడ్ని మధ్య తరగతి వాడూ, మధ్య తరగతి వాడిని ధనవంతుడూ, అతన్ని అధికారంలో వున్నవాడూ– ఇలా వేట సాగుతూనే వున్నప్పుడు ఒకరి నొకరు ఆడిపోసుకోవడం ఎందుకు? పొద్దున్న పరిమళ మాటాడినదానికీ, ఆమె ప్రవర్తనకూ ఎక్కడా పొంతనలేదే. పరిమళ కూడా తన స్వార్థానికి ఎదుటివారి బలహీనతను అవకాశంగా తీసుకుంది.

నాకిప్పుడు పరిమళ సన్నజాజి మొగ్గలా అనిపించడంలేదు. సన్నగా వున్న ఆమె సాగిసాగి మెలికలు తిరిగిపోయి జలగలా మారిపోయినట్టు అనిపిస్తోంది.

పరిమళ కనిపిస్తే గట్టిగా దులిపెయ్యాలని అనుకున్నాను. తప్పు చేస్తూ తప్పు చెయ్యనివాళ్ళలాగ మాట్లాడడం ఘోరమైన నేరం. మరొకరిని విమర్శించేముందు మనల్ని మనం ఒకసారి తడుముకుని చూసుకోవడం అవసరం.

పరిమళను కలద్దామని సాయంకాలం మళ్ళీ హాస్పిటల్‌కు వెళ్ళాను. డాక్టరు గురించని వొచ్చి అతని గదిలో కనిపించకపోతే తిరిగి వెళ్ళిపోబోతున్న ఆమెను పిలిచి పలకరించాను. మేడమీది వార్డులోకి వెళ్ళారనీ, ఇప్పుడే వస్తారనీ, కూర్చోమని చెప్తే ఆమె కూర్చోలేదు. నుంచొనే ఎదురు చూస్తోంది.

"మీరు కాలేజీలో చదువుకొంటున్నారా?"

అవునన్నట్టు తలవూపింది ఆమె.

"పోలిటిక్సు గ్రూపు కాబోలు తీసుకున్నారు."

ఈసారి కూడా తలే వూపింది. ఈ ప్రసంగం ఆమెకు నచ్చినట్టు లేదు. ఆమె ముఖంలో అయిష్టత కనిపిస్తూనే వుంది.

"నిన్న రక్తం యిచ్చిన అమ్మాయి మీ చెల్లెలా? ఆమెను ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం" అన్నాను.

ఆమె ఏమీ మాట్లాడక మరెటో చూస్తోంది.

"ఎక్కడో చూశాను. మావాళ్ళింట్లో ఎప్పుడో పని చేసినట్టు జ్ఞాపకం."

అప్పటికీ పరిమళ మాట్లాడలేదు. వెళ్ళిపోదామని గాబోలు కదిలింది.

ఇంత తాపీగా మాట్లాడితే తెమిలినట్టే.

"చూడండీ! నిన్న రక్తం యిచ్చినందుకు మీ చెల్లెలు ఎంత పుచ్చుకుందేమిటి? అయిదు రూపాయలా? పదా?"

పరిమళ దెబ్బతిన్నట్టు చూసింది. మాట్లాడలేదు.

"అయిదుకన్న ఎక్కువ తీసుకొని వుండదులెండి. అల్పసంతోషులు వాళ్లు. వాళ్ళ కడుపు కక్కుర్తికి అయిదు రూపాయలే మహా ఎక్కువ."

ఆమె ఇక నిలచోలేక వెళ్ళిపోయింది.

నా దగ్గర యింకా చాలా అంబులు మిగిలిపోయాయి. నిన్నటినించీ వాటికి పదును పెట్టుకుంటూ కూర్చున్నాను. అవన్నీ వ్యర్థమై పోయాయే అని నా బాధ.

మిత్రుడువస్తే జరిగినదంతా చెప్పాను. అతను నొచ్చుకున్నాడు.

"పాపం ఆ అమ్మాయికి ఆధారం ఆ తండ్రి వొక్కడే. యింకెవరూలేరు. మధ్య తరగతి కుటుంబం. ఆ తండ్రే లేకపోతే ఆ అమ్మాయి దిక్కులేనిదై పోతుంది. ఒంటరిగా సంఘంలో మగాడు బ్రతగ్గలడు కాని

ఆడది బ్రతకలేదు. ఈ పరిస్థితుల్లో ఆమె తన తండ్రిని బ్రతికించుకోవడానికి ఏమైనా చెయ్యక తప్పదు. ఇది స్వార్థమే. కాని ఆ పరిస్థితుల్లో నువ్వున్నా అలానే ప్రవర్తిస్తావు."

నేనేమీ మాట్లాడలేకపోయాను. నా కంఠం మూగపోయింది. పరిమళ మళ్ళీ రావొచ్చు. ఆమె మొఖంలోకి చూసే ధైర్యం నాకులేదు. అక్కడనుంచి బయలుదేరాను.

దారిలోనే ఎదురుపడింది పరిమళ. తప్పించుకోలేక ఆమె ముఖంలోకి చూశాను.

అప్పుడు ఆమె చూసిన చూపు__వేటగాడిని చూసినట్టు ఆ కళ్ళ బెదురు, పుట్టెడు దైన్యం, తనసిగ్గు వలువల్ని వలిచే దుశ్శాసనుడి బారిన పడినట్టు ఆ కళ్ళలో నిస్సహాయత నన్ను సిగ్గుతో పశ్చాత్తాపంతో కాల్చేశాయి.

ఆమె ఎదుట నేను నిలుచోలేకపోయాను.

***